

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



ఆదివారం 27-09-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :101 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

పూరిగుడిసెలు లేని
తెలంగాణే లక్ష్యం

- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు
- తొలి విడతలో 4.50 లక్షలు..
- రెండో విడతలో మరో 2.50 లక్షలు
- ఒక్కో ఇంటికి రూ.5 లక్షల సాయం: మంత్రి పొంగులేటి



వారిని కాదు.. ధైర్యముంటే
నన్ను అడ్డుకోండి



న్యూస్ డెస్క్,26 సెప్టెంబర్ (ఇది కద నిజం) : పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భాజపాపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సెరాంపుర్‌లో జరగాల్సిన తన ర్యాలీకి వెళ్లకుండా తమ వర్గం నేతలను భాజపా గూండాలు అడ్డుకున్నారని ఆరోపించారు. కొందరిని గృహ నిర్బంధం చేశారని..మరికొందరిని దారిలో అడ్డుకొని, వాహనాలు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమ వేదికకు వెళ్లే మార్గాన్ని సైతం తమ ఆధీనంలోకి తీసుకొని.. కార్యకర్తలపై బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. నిజంగా ధైర్యముంటే తమ నేతలను కాకుండా తనను అడ్డుకోవాలని దీదీ భాజపాకు సవాల్ విసిరారు.

రిఫరీపైనే అనుమానం వస్తే
ప్రజాస్వామ్యానికే ప్రమాదం

- ఈసీ స్వతంత్రతను కాపాడాల్సిందే
- ఓటు హక్కుపై రాజీ లేదు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- SIRలో వచ్చిన అభ్యంతరాలపై సమాధానం చెప్పాలని డిమాండ్



ఎక్కడ పోయినా 'దేఖ్ లేంగే'..
కేసీఆర్ అంటున్నారు

- ప్రజల గుండెల్లో కేసీఆర్ భద్రంగా ఉన్నారు
- కాంగ్రెస్ పాలనలో పాత పథకాల విలువ తెలుస్తోంది
- రైతుబంధు ఆలస్యమైతే కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు



హైదరాబాద్,26 సెప్టెంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో ఎక్కడికి వెళ్లినా ప్రజల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేరే వినిపిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. "గణేశుల పండుగ వచ్చింది.. ఊరూరా ఏం నడుస్తోంది? ఎక్కడికి వెళ్లినా 'దేఖ్ లేంగే' అంటున్నారు.. కేసీఆర్ అంటున్నారు" అని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరగా, వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

22-ఏ ఆస్తుల రిజిస్ట్రేషన్లకు గ్రీన్ సిగ్నల్!

- ప్లాట్లు, ఇళ్లు, ఫ్లాట్లకు ఊరట
- ప్రభుత్వ అనుమతులు ఉంటేనే రిజిస్ట్రేషన్
- లింక్ డాక్యుమెంట్లు తప్పనిసరి
- వివాదాల పరిష్కారానికి జిల్లా స్థాయి కమిటీలు



హైదరాబాద్,26 సెప్టెంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్న కొన్ని ఆస్తుల యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. చెల్లుబాటు అయ్యే ప్రభుత్వ అనుమతులు ఉన్న ఓపెన్ ప్లాట్లు, ఇళ్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు షరతులతో అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది.

కొత్త నిబంధనల ప్రకారం 22-ఏ పరిధిలో ఆస్తి ఉన్నంత మాత్రాన రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉండదు. ఆ ప్లాట్‌కు HMDA, GHMC, DTCP, మున్సిపాలిటీ లేదా సంబంధిత స్థానిక సంస్థ నుంచి చట్టబద్ధమైన లేఅవుట్, బిల్డింగ్ లేదా అపార్ట్‌మెంట్ అనుమతి ఉండటం తప్పనిసరి.

లింక్ డాక్యుమెంట్ ఉంటేనే ముందుకు

సంబంధిత ప్రభుత్వ అనుమతి పొందిన తర్వాత జరిగిన లావాదేవీలకు సంబంధించిన చెల్లుబాటు అయ్యే లింక్ డాక్యుమెంట్‌ను కూడా సమర్పించాల్సి ఉంటుంది. ఆస్తి స్వభావం, భూ రికార్డులు, అనుమతులు, న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే అధికారులు రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు.

మన్మోహన్‌కు
'భారతరత్న' ఇవ్వాల్సిందే!

- దేశ ఆర్థిక ప్రగతికి ఆయన దార్శనికుడు
- తెలంగాణ ఏర్పాటులో చిరస్మరణీయ పాత్ర
- ఢిల్లీలో స్మారక భవనం, విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి
- కేంద్రంపై ఒత్తిడి తెస్తాం: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, 26 సెప్టెంబర్ (ఇది కద నిజం): : మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయనకు వెంటనే 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలి ఐటీ కారిడార్‌లోని విప్రో సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా సీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణతో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ చూపిన నాయకుడని రేవంత్ రెడ్డి కొనియాడారు. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ చేపట్టిన 1991 ఆర్థిక సంస్కరణలు, సరళీకరణ విధానాలు భారత ఆర్థిక వ్యవస్థలో కీలక మలుపుగా నిలిచాయని పేర్కొన్నారు. హైదరాబాద్ ఐటీ, ఫైనాన్షియల్ రంగాల విస్తరణకు కూడా ఆ సంస్కరణలు అనుకూల వాతావరణం కల్పించాయని ఆయన అన్నారు.

2లో..

ఓటుబ్యాంకు రాజకీయాలు
మనకొద్దు



న్యూస్ డెస్క్,26 సెప్టెంబర్ (ఇది కద నిజం): ఓటు బ్యాంకు రాజకీయాలకు బదులుగా సామాజిక సంస్కరణలు, సానుకూల మార్పులపై దృష్టి సారించాలని భాజపా కార్యకర్తలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. వారణాసి నుంచి వాద్‌నగర్ వరకు సాగుతున్న సేవా యాత్ర (మోటార్ సైకిల్ ర్యాలీ)లో పాల్గొంటున్న వారితో శుక్రవారం ప్రధాని వీడియో విధానంలో మాట్లాడారు. గత 12 ఏళ్లలో దేశంలోని నగరాలు, గ్రామాల మధ్య అంతరం గణనీయంగా తగ్గిందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఎంతో మెరుగుపడ్డాయని మోదీ పేర్కొన్నారు.

ఉమ్మడి ప్రకటనతో విశ్వసనీయతను స్పష్టం చేసిన ఎన్నికల సంఘం: సీఎం చంద్రబాబు



న్యూస్ డెస్క్, 26 సెప్టెంబర్ (ఇది కద నిజం): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవంగా చేసిన ప్రకటన అపోహలకు ముగింపు పలికిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శనివారం తన ఎక్స్ ఖాతా వేదికగా ఆయన స్పందించారు. 'ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు ఎస్. ఎస్. సంధూ, వివేక్ జోషి కలిసి ఏకగ్రీవంగా ఇచ్చిన వివరణ మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను మరోసారి స్పష్టం చేసింది.

డీఎస్సీపై సీబీఐ విచారణకు
సిద్ధమైన ప్రభుత్వం

సోమిరెడ్డి కీలక ప్రకటన



న్యూస్ డెస్క్,26 సెప్టెంబర్ (ఇది కద నిజం) : రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన డీఎస్సీపై వైసీపీ ఆరోపణలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ విమర్శలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. డీఎస్సీ నిర్వహణపై ఎలాంటి సీబీఐ విచారణకైనా తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

మద్యం మత్తులో అవ్వను
చంపిన మనవడు

న్యూస్ డెస్క్,26 సెప్టెంబర్ (ఇది కద నిజం) : మార్కాపురం జిల్లా దోర్నాల మండలం తూర్పు బొమ్మలాపురంలో దారుణం జరిగింది. పసుపులేటి లక్ష్మమ్మ అనే ఓ వృద్ధురాలిని మద్యం మత్తులో మనవడే పెట్రోల్ పోసి నిప్పంటించి చంపేశారు.



Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 27-09-2026

మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాల్సిందే!

మొదటి పేజీ తరువాయి

తెలంగాణకు మరువలేని సేవ

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ సింగ్ పాత్రను సీఎం ప్రత్యేకంగా గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ ఆయన ప్రధానమంత్రిగా ఉన్న సమయంలోనే పూర్తయిందని, రాష్ట్ర ప్రజల ఆకాంక్ష సాకారం కావడంలో ఆయన పాత్ర చిరస్మరణీయమని అన్నారు. విగ్రహ ప్రాంగణంలో తెలంగాణకు సంబంధించిన ఆయన సంతకాన్ని కూడా ప్రత్యేకంగా పొందుపరిచినట్లు తెలిపారు.

సంక్షేమానికి హక్కుల రూపం

మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం, విద్యాహక్కు చట్టం వంటి కీలక సంక్షేమ, హక్కుల ఆధారిత చట్టాలు అమల్లోకి వచ్చాయని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం ఆయన నిశ్శబ్దంగా, నిబద్ధతతో సేవలందించారని ప్రశంసించారు.

ఢిల్లీలో స్మారక కేంద్రం ఏర్పాటు చేయాలి

మన్మోహన్ సింగ్ సేవలను భావితరాలకు తెలియజేసేలా ఢిల్లీలో ఆయన పేరుతో స్మారక భవనం, విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఆయనకు భారతరత్న ప్రకటించాలన్న డిమాండ్‌ను జాతీయ స్థాయిలో ముందుకు తీసుకెళ్తామని, కాంగ్రెస్ ఎంపీలు, పార్టీ అగ్రనేతలతో కలిసి పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామని తెలిపారు.

"మౌనమే ఆయన భాష.. దేశాభివృద్ధే ఆయన లక్ష్యం"

దేశ ఆర్థిక వ్యవస్థకు పునాదులు బలోపేతం చేసిన మన్మోహన్ సింగ్ సేవలకు అత్యున్నత పౌర పురస్కారంతో గౌరవం దక్కాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఎక్కడ పోయినా 'దేఖ్ లేంగే'..
కేసీఆర్ అంటున్నరు: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ కొంతకాలంగా ప్రజల ముందుకు రాకపోయినా ఆయనకు ప్రజల్లో ఆదరణ తగ్గలేదని అన్నారు. కాంగ్రెస్ నేతలు తరచూ "కేసీఆర్ బయటకు రావాలి" అని ప్రశ్నిస్తున్నారని, అయితే ఆయన ప్రజల గుండెల్లో ఉన్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెన్షన్ మొత్తాన్ని రూ.200 నుంచి రూ.2 వేలకు పెంచిన విషయాన్ని గుర్తుచేస్తూ, ప్రస్తుతం పెన్షన్ పొందుతున్న వృద్ధులు, ఇతర లబ్ధిదారులు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారని కేటీఆర్ చెప్పారు.

మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా నీరు అందించామని, గతంలో నీటి కోసం బిందెలు, కుండలతో పడిన ఇబ్బందులను తగ్గించామని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి వచ్చే నీటి బొట్టులో కేసీఆర్ చేసిన పనిని మహిళలు గుర్తు చేసుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

కళ్యాణలక్ష్మి పథకం ద్వారా పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందించామని, చెక్కు తీసుకున్న ప్రతిసారీ కుటుంబాలు కేసీఆర్‌ను ఒక మేనమామలా గుర్తు చేసుకుంటున్నాయని కేటీఆర్ అన్నారు. గోదావరి జలాలను కాళేశ్వరం ద్వారా వివిధ ప్రాంతాలకు తీసుకువచ్చామని, డోర్నకల్, మహబూబాబాద్ నుంచి కోదాడ, సూర్యాపేట ప్రాంతాల వరకు రైతులకు సాగునీరు అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేసిందని పేర్కొన్నారు.

రైతుబంధు విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు చేశారు. బీఆర్ఎస్ పాలనలో సాగు సీజన్‌కు ముందే రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేవని, ఇప్పుడు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. రైతులకు నిధులు విడుదల చేసిన ప్రతిసారీ ప్రభుత్వం ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారం చేసుకుంటోందని, కానీ గతంలో రైతులకు సమయానికి అందిన సహాయం ఇప్పుడు అందడం లేదని ఆయన విమర్శించారు.

ప్రస్తుత ప్రభుత్వం గత బీఆర్ఎస్ పాలనపై విమర్శలు చేయడానికే ఎక్కువ సమయం వెచ్చిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం కంటే కేసీఆర్‌ను విమర్శించడానికే ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, సాగునీరు, తాగునీరు, రైతు సహాయ పథకాలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

ఉమ్మడి ప్రకటనతో విశ్వసనీయతను స్పష్టం చేసిన ఎన్నికల సంఘం: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న అపోహలకు తెరదించింది'. 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన నిర్ణయాలు సమష్టిగా, సంస్థాగత విధివిధానాలను కచ్చితంగా పాటిస్తూ తీసుకుంటారు. స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు దురదృష్టకరం. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయి'.

'బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాతనంతో స్వీకరించడం కూడా నాయకత్వ లక్షణమే. మన రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యం. భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత' అని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

22-ఏ ఆస్తుల రిజిస్ట్రేషన్లకు గ్రీన్ సిగ్నల్!

మొదటి పేజీ తరువాయి

కోర్టు కేసులుంటే తీర్పుకే లోబడి

న్యాయస్థానాల్లో వివాదాలు కొనసాగుతున్న ఆస్తుల విషయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోర్టు తీర్పులు, ఆదేశాలకు లోబడి ఉంటుంది. ప్రతి ఆస్తిని ఒకే విధంగా పరిగణించకుండా, సంబంధిత రికార్డులు, వివాద స్వభావం, చట్టపరమైన పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకోనున్నారు.

కలెక్టర్ నేతృత్వంలో కమిటీ

రిజిస్ట్రేషన్ల సమయంలో సమస్యలు లేదా సందేహాలు తలెత్తితే వాటి పరిష్కారానికి జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీలో అదనపు కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు ఎవీఈఓ, మున్సిపల్ సంస్థ లేదా సంబంధిత స్థానిక సంస్థ ప్రతినిధులు ఉంటారు.

అందరికీ వర్తించదు.. షరతులు తప్పనిసరి

22-ఏ జాబితాలో ఉన్న ప్రతి ఆస్తికి ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ అవకాశం వచ్చినట్లు కాదని తాజా నిర్ణయం స్పష్టం చేస్తోంది. చట్టబద్ధమైన అనుమతులు, సరైన రికార్డులు, లింక్ డాక్యుమెంట్లు ఉన్న అర్హమైన ఆస్తులకే ఈ వెసులుబాటు వర్తించనుంది.

డీఎస్సీపై సీబీఐ విచారణకు సిద్ధమైన ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

అయితే వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి గతంలో తనపై వచ్చిన అక్రమాస్తుల కేసులు, అలాగే మాజీ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు విషయంలో సీబీఐ వెల్లడించిన విషయాలను అంగీకరించాలని సోమిరెడ్డి డిమాండ్ చేశారు. సీబీఐ నివేదికలు, దర్యాప్తు అంశాలను జగన్ నిజాలని ఒప్పుకున్న మరుక్షణమే, డీఎస్సీ వ్యవహారంపై కూడా సీబీఐ విచారణ జరిపించేలా సీఎం చంద్రబాబును తను ఒప్పిస్తానని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు.

పారదర్శకంగా భర్తీ ప్రక్రియ

రాష్ట్రంలో నిర్వహించిన 16,372 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరిగిందని, ఇందులో ఎలాంటి అక్రమాలకు చోటు లేదని తెలిపారు. స్పోర్ట్స్ కోటా నియామకాల్లోనూ ఎలాంటి అవకతవకలు జరగలేదని, అభ్యర్థుల అర్హతల ఆధారంగానే ఎంపికలు సాగాయని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు. నిరుద్యోగులకు అందించిన ఉద్యోగ అవకాశాలను జీర్ణించుకోలేకనే డీఎస్సీపై జగన్ పార్టీ లేనిపోని ఆరోపణలు చేస్తోందని సోమిరెడ్డి మండిపడ్డారు. డీఎస్సీపై వైసీపీ చేస్తోన్న విమర్శలు, ఆరోపణలన్నీ కేవలం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవన్నారు. నియమకాల విషయంలో ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో వ్యవహరించిందని, ప్రతిపక్షం చేసే బురదజల్లే రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హెచ్చరించారు.

ఓటుబ్యాంకు రాజకీయాలు మనకొద్దు

మొదటి పేజీ తరువాయి

దేశ మహిళల్లో స్వయం సమృద్ధి కూడా పెరిగిందని ఆయన అన్నారు. " మహాత్మా గాంధీ జీవితాన్ని పరిశీలిస్తే, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడటం, స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించడంతో పాటు, ఆయన ఒక గొప్ప సామాజిక సంస్కర్తగానూ నిలిచారని మనకు అర్థమవుతుంది. సమాజంలో ఉన్న దురాచారాలకు వ్యతిరేకంగా ఆయన ఎల్లప్పుడూ కృషి చేశారు. కాబట్టి రాజకీయ కార్యకర్తలుగా మనం కూడా ఓటు బ్యాంకుల గురించి ఆలోచించకుండా, సామాజిక సంస్కరణ, సానుకూల మార్పు దిశగా కృషిని కొనసాగించాలి" అని మోదీ అన్నారు.

'మేక్ ఇన్ ఇండియా'పై..

భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రారంభమైన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ తాజాగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 12 ఏళుగా వివిధ రంగాల్లో వచ్చిన మార్పులను ఆయన తన పోస్ట్‌లో ప్రస్తావించారు. 2014 సెప్టెంబరు 25న ప్రధాని మోదీ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెట్టుబడులను ఆకర్షించడం, తయారీని పెంచడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, మౌలిక వసతులను బలోపేతం చేయడం ఆ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు. "భారత్‌లో మరింత తయారీ. భారత్‌లో మరింత పెట్టుబడి. భారత్ నుంచి మరింత ఎగుమతులు. వివిధ రంగాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది' అని మోదీ పోస్టులో చెప్పారు.

రిఫరీపైనే అనుమానం వస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదం



హైదరాబాద్,26 సెప్టెంబర్ (ఇది కద నిజం): ఓటరు జాబితాల సవరణ ప్రక్రియపై తలెత్తుతున్న వివాదాల నేపథ్యంలో ఎన్నికల సంఘం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. మ్యాచ్ నిర్వహించే రిఫరీపైనే అనుమానం వస్తే ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదమని వ్యాఖ్యానించారు.

ఎన్నికల సంఘం అధికార పార్టీ కార్యాలయం కాదని, ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం ఇచ్చిన హక్కని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుంచి ప్రధాన న్యాయమూర్తిని తొలగించిన అంశంపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి లేవనెత్తినట్లు వచ్చిన అభ్యంతరాలపై ఈసీ సమగ్ర వివరణ ఇవ్వాలని కోరారు. గోవాలో అర్హులైన ఓటర్ల పేర్లు తుది జాబితాలో చేరకపోవడం ఆందోళనకరమని, సాంకేతిక కారణాలతో ఓటు హక్కు నిలిచిపోకూడదన్నారు.

దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల సవరణలో పారదర్శకత పాటించాలని, పోలింగ్‌కు ముందే అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. వివాదాస్పద నిర్ణయాలు, సాంకేతిక వ్యవస్థలపై నిష్పాక్షిక విచారణ జరపాలని కోరారు.

పూరిగుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం

జనగామ,26 సెప్టెంబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో పూరిగుడిసెలు లేకుండా చేసి, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా అనుకూలంగా లేకపోయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీతో పాటు పేదల సంక్షేమానికి పలు కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల కోసం హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచామని, ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థల నిర్మాణానికి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని పొంగులేటి వెల్లడించారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించామని, నిర్మాణ దశలను బట్టి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తున్నామని చెప్పారు. దసరా నాటికి 2.18 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గానికి అదనంగా 2,000 ఇళ్ల చొప్పున కేటాయించినట్లు మంత్రి చెప్పారు. పూరిగుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు రెండో విడతలో ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. జనగామ నియోజకవర్గంలో గుర్తించిన 500 పూరిగుడిసెల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున సహాయం అందించనున్నట్లు చెప్పారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లు, మొండిగోడలు, స్లాబ్ స్థాయిలో నిలిచిపోయిన నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు సహాయం అందించే కార్యక్రమాన్ని కూడా చేపడుతున్నట్లు వివరించారు.

గతంలో నిర్మాణం పూర్తికాని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించడం ప్రభుత్వ బాధ్యత అని పొంగులేటి అన్నారు. జనగామలో ఇందుకోసం వెంటనే రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే జనగామ మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధికి తొలి విడతగా రూ.25 కోట్లు కేటాయిస్తామని, ఇప్పటికే ప్రారంభించిన లేదా టెండర్లు పూర్తైన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. గతంలో సేకరించిన ప్రభుత్వ ఇళ్ల స్థలాలను గుర్తించి అర్హులకు పంపిణీ చేసి, తదుపరి విడతల్లో అక్కడ నిర్మాణాలు చేపడతామని చెప్పారు. మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు, రైతు భరోసా, వరి రైతులకు మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు బోనస్, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు. అనంతరం 500 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.

మద్యం మత్తులో అవ్వను చంపిన మనవడు



న్యూస్ డెస్క్,26 సెప్టెంబర్ (ఇది కద నిజం) మార్కాపురం జిల్లా దోర్నాల మండలం తూర్పు బొమ్మలాపురంలో దారుణం జరిగింది. పసుపులేటి లక్ష్మమ్మ అనే ఓ వృద్ధురాలిని మద్యం మత్తులో మనవడే పెట్రోల్ పోసి నిప్పంటించి చంపేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వ్యసనాలకు బానిసైన మట్టుపల్లి రాములు కుటుంబ సభ్యులతో నిత్యం గొడవ పడుతుండేవాడు. దీంతో అతని భార్య మూడు నెలల క్రితం ఇల్లు వదిలి వెళ్ళిపోయింది. శుక్రవారం రాత్రి మద్యం తాగి వచ్చిన అతను.. తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. దీంతో వారు కూడా ఇంట్లోంచి బయటికి వెళ్లిపోయారు. ఆ సమయంలో మంచంపై నిద్రిస్తున్న అవ్వ లక్ష్మమ్మ(81)పై పెట్రోల్ పోసి అతడు నిప్పంటించాడు. దీంతో ఆమె చనిపోయింది. శనివారం ఉదయం మృతురాలి కూతురు, అల్లుడు వచ్చి చూడగా పూర్తిగా కాలిపోయిన స్థితిలో కనిపించింది. వారు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. సీఐ అజయ్ కుమార్ ఎస్ఐ నాగరాజులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వారిని కాదు.. ధైర్యముంటే నన్ను అడ్డుకోండి

మొదటి పేజీ తరువాయి



'మా నేతలు కొందరిని గృహ నిర్బంధంలో ఉంచారు. ర్యాలీ జరిగే ప్రదేశానికి వెళ్లనివ్వడం లేదు. కోర్టు అనుమతితోనే ర్యాలీ నిర్వహిస్తున్నాం. ఇది సజావుగా సాగేలా చూడడం పోలీసులు, అధికార యంత్రాంగం బాధ్యత. కానీ వారు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యదేశమైన భారత్‌లో ఇటువంటి దాడులు జరగడం సిగ్గుచేటు. ర్యాలీకి వెళ్లకుండా చేయడానికి ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆగేదీ లేదు. సభకు వెళ్లి ప్రసంగిస్తాను. సాధ్యమైతే నన్ను ఆపండి' అని మమత పేర్కొన్నారు.

కునాల్ ఘోష్ కారుపై గుడ్లు..రాళ్ల దాడి..

మమతా బెనర్జీ ర్యాలీకి వెళ్లున్న ఆమె వర్గం ఎమ్మెల్యే కునాల్ ఘోష్‌ను కొందరు దుండగులు హూగ్లీ జిల్లాలో అడ్డుకున్నారు. నల్ల జెండాలు పట్టుకున్న కొందరు ఆయన కారుపై రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేశారు. దీంతో ముందుకు వెళ్లడానికి అవకాశం లేక ఆయన వెనుదిరగాల్సి వచ్చింది. ఈ ఘటనలో కారు అద్దాలు పగిలిపోయినట్లు తెలుస్తోంది.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 27-09-2026

రేవంత్ రెడ్డిది చేతగానీ ఫెయిల్యూర్ సర్కార్

- ప్రభుత్వం పట్టిలేని తనంతో ఏటా 4 వేల మంది పసిపిల్లలు చనిపోతున్నారు
- పరిపాలన చేతకాకపోతే పక్కకు తప్పుకోవాలి
- విద్య, వైద్యం విషయంలో ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తున్నాం
- అఫిడవిట్ లో ఉన్న దానికన్నా రూపాయి ఎక్కువ ఉన్న తిరిగి ఇచ్చేస్తా
- ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పోటీ చేస్తుంది
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



ఇది కద నిజం,హైదరాబాద్ :

రేవంత్ రెడ్డిది చేతకాని అసమర్థ ప్రభుత్వమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ఈ చేతకాని ప్రభుత్వం కారణంగా రాష్ట్రంలో ఏటా 4 వేల మంది చిన్నారులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత ఆధునిక కాలంలో ఏటా వేలాది పసికందులు చనిపోతుంటే ఈ ప్రభుత్వానికి సిగ్గు అనిపించడం లేదా అని ప్రశ్నించారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఆదిలాబాద్ లోని రిమ్స్ హాస్పిటల్ లో పసికందుల మరణాల తర్వాత ఓ మిత్రుడు రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య శాఖ పనితీరు ఎంత అధ్వానంగా ఉందో డేటాతో సహా తనకు పంపించారని చెప్పారు. ఆ డేటా చూసిన తర్వాత రెండు రోజుల పాటు నిద్ర పట్టలేదని.. అందులో భయంకరమైన చేదు వాస్తవాలు ఉన్నాయన్నారు. ఆ డేటా వివరాలను మీడియా ముందు ఉంచారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో 2020-21 లో 6 వేలు, 2022-23 లో 4,933, 2024-25 లో 3,853 మంది పసిపిల్లలు చనిపోయాని తెలిపారు. ఏ జిల్లాలో చూసిన సరే ఏటా 2 వందల వరకు పసిపిల్లలు మరణించారని తెలిపారు. హైదరాబాద్ ను ప్రపంచ శ్రేణి నగరంగా తీర్చిదిద్దుతామని చెప్తోన్న పాలకులు నగరంలో 1,046 మంది చిన్నారులు చనిపోతే కనీసం మానవత్వం చూపించడం లేదు. ప్రభుత్వానికి పరిపాలన చేతకాకపోతే బాధ్యతల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. వైద్యానికి పదిశాతం బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి కనీసం 5 శాతం కూడా కేటాయించడం లేదన్నారు. కేటాయించిన బడ్జెట్ కూడా పూర్తిగా ఖర్చు చేయడం లేదని చెప్పారు. గతేడాది 13,192 కోట్లు కేటాయిస్తే ఖర్చు చేసింది 9,242 కోట్లు మాత్రమేనన్నారు. కేటాయించిన బడ్జెట్ ను కూడా ఖర్చు చేయని ప్రభుత్వాన్ని కాగ్ కడిగి పారేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో 11 హెల్త్ స్కీమ్ లు ఉంటే 7 స్కీమ్ లకు ఒక్క పైసా కేటాయించలేదన్నారు. ఆరోగ్యశ్రీ కోసం 7 వందల కోట్లు కేటాయిస్తే 140 కోట్లే ఖర్చు చేశారన్నారు. ఆరోగ్యశ్రీ స్కీం పెండింగ్ బకాయిలు 5 వందల కోట్లు ఉంటే పైసా విడుదల చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధ్వానంగా హాస్పిటళ్లు.. కలెక్టర్లు ఏం చేస్తున్నారు?

రాష్ట్రంలో హాస్పిటల్స్ అత్యంత అధ్వాన్నంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ లోని రిమ్స్ హాస్పిటల్ లో ఎక్కడ చూసిన చెత్తా చెదారమే కనిపించిందన్నారు. రాష్ట్ర మంత్రి, ప్రతిపక్ష నాయకులు ఇటీవల రిమ్స్ ను సందర్శించారని, అక్కడే పరిస్థితి ఇలా ఉంటే మిగతా హాస్పిటల్స్ పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. జిల్లా కలెక్టర్లు ఎందుకు ప్రభుత్వ హాస్పిటల్స్, హాస్టల్స్ విజిట్ చేయడం లేదని ప్రశ్నించారు. ప్రజల బాగోగులు చూసుకోవటం కన్నా కలెక్టర్లకు వేరే పనేముందని నిలదీశారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ హాస్పిటళ్లను విజిట్ చేస్తే పరిస్థితులు అవే మారుతాయన్నారు. హెల్త్ మినిస్టర్ కూడా బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేన్నరేళ్ల తర్వాత పెద్ద ప్రమాదం జరిగితే తప్ప హెల్త్ మినిస్టర్ ఆదిలాబాద్ రిమ్స్ ను విజిట్ చేయలేదన్నారు. ఆదిలాబాద్ కు వచ్చి జిల్లాలో వైద్య పరిస్థితుల గురించి కాకుండా హెలీక్యాప్టర్ ఫ్యూయల్ అయిపోయిందని ఆయన గొడవ పడి వెళ్లిపోయారే తప్ప ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ కు ఆదేశాలు ఇవ్వలేదన్నారు.

ఆదిలాబాద్ లో రోడ్లు సరిగా లేకపోవడంతోనూ ప్రజలు మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఐటీడీఏలో ఉన్న 70 శాతం నిధులను కూడా ఈ ప్రభుత్వానికి వాడుకోవడం చేతకావడం లేదన్నారు. ఆ నిధులను వినియోగించుకొని ఉట్నూర్ ఏజెన్సీలో రోడ్లు వేయించాలని కోరారు. ప్రభుత్వ హాస్పిటల్స్ లో మౌలిక సదుపాయాలు లేవని నీలోఫర్ హాస్పిటల్ లో బెడ్ ఆక్యూపెన్సీ 200 శాతం ఉండటంతో పేషెంట్లకు బెడ్స్ దొరకడం లేదన్నారు. నిమ్స్ ఆస్పత్రిలో ముఖ్యమంత్రి చెబితే గానీ బెడ్ దొరికే పరిస్థితి లేదని, హెల్త్ మినిస్టర్ చెప్పినా సరే నిమ్స్ లో బెడ్ ఇవ్వడం లేదన్నారు. నిమ్స్ లో సర్జరీ కోసం 7 నెలలు వేచి చూడాల్సిన దుస్థితి ఉందని విచారం వ్యక్తం చేశారు. ఆడపిల్లల శానిటరీ ప్యాడ్ పడేసేందుకు కూడా స్కూల్స్ లో సదుపాయాలు లేవన్నారు.

విద్య, వైద్యం విషయంలో ప్రభుత్వంపై యుద్ధం

విద్య, వైద్యం విషయంలో ఫోకస్ పెట్టేలా ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తున్నామని కవిత హెచ్చరించారు. తోలు తీసైనా సరే ఈ ప్రభుత్వం మెడలు వంచాల్సిన అవసరముందన్నారు. విద్య, వైద్యం విషయంలో మార్పు రావాలంటే ప్రజలు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎక్కడికక్కడ ప్రభుత్వ హాస్పిటళ్లకు వెళ్లి అక్కడి పరిస్థితులను ఫొటో తీసి టీఆర్ఎస్ పార్టీకి పంపించాలని కోరారు. ప్రజలు తిరగబడి ప్రశ్నించినప్పుడు మాత్రమే మార్పు సాధ్యమవుతుందన్నారు. టీఆర్ఎస్ కార్యకర్తలు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లి బాత్ రూమ్ ల పరిస్థితిపై నివేదిక ఇవ్వాలన్నారు. బాత్ రూమ్ లోని చోట మనమే చందా వేసుకొని కట్టిద్దామని సూచించారు. వైద్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చే పార్టీగా ఇక నుంచి అన్ని ప్రభుత్వ హాస్పిటళ్లను విజిట్ చేస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి స్థలాలు తీసుకొని పేదలకు 25 శాతం ఉచిత వైద్యం అందిస్తామని అగ్రిమెంట్ చేసుకున్న కార్పొరేట్ హాస్పిటళ్లు తమ ఆస్పత్రులు పేదవాళ్లను తమ గేటులోపలికి కూడా రానివ్వడం లేదన్నారు. ఆయా హాస్పిటళ్లలో 25 శాతం ఉచిత వైద్యం పేదలకు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అఫిడవిట్ లో కన్నా రూపాయి ఎక్కువ ఉన్న తిరిగి ఇచ్చేస్తా

తాను ఎన్నికల అఫిడవిట్ లో పేర్కొన్న ఉన్న దాని కన్నా ఒక్క రూపాయి ఎక్కువ ఉన్నట్టు ఎవరు నిరూపించినా ఆ మొత్తం తిరిగి ఇచ్చేస్తానని స్పష్టం చేశారు. తన ఫామ్ హౌస్ లీగల్ గా కట్టుకున్నదని అందులో కబ్జా ల్యాండ్ గానీ, ఎఫ్టీఎల్ జోన్ గానీ, అసైన్డ్ ల్యాండ్ గానీ లేదన్నారు. ప్రతి పైసా తాను చట్టానికి లోబడి సంపాదించుకున్నదేనని.. భవిష్యత్ లో కూడా అలాగే ఉంటానని స్పష్టం చేశారు. కేసీఆర్, కేటీఆర్ ఫామ్ హౌస్ లకు సంబంధించి వేసిన సిట్ ఉత్తదేనన్నారు. ఫోన్ ట్యాపింగ్ సహా అనేక రంగాల్లో వేసిన సెట్ లతో ఏం ఒరిగిందని ప్రశ్నించారు. డైవర్షన్ స్కీమ్ లో భాగంగానే ముఖ్యమంత్రి ఇలాంటి సిట్ లు వేస్తారని.. చర్యలు మాత్రం ఉండవని చెప్పారు. ఇంటర్నల్ గా ఒప్పందాలు జరిగే వరకు ఇలాంటి టైమ్ పాస్ సిట్ లు కొనసాగుతూనే ఉంటాయన్నారు.

ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తాం

ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పోటీ చేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. మరో పార్టీ నుంచి గెలిచిన వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ ఎంపీగా సీటు ఇచ్చి పోటీ చేయించడం ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధమన్నారు. అలాంటి పార్టీకి మద్దతిస్తే రాజ్యాంగం, చట్టాలు ఏమీ వద్దని మనమే చెప్పినట్లవుతుందని ప్రజలకు సూచించారు. ఎస్ఐఆర్ విషయంలో చాలా గందరగోళం నెలకొందని.. రీ ఎడిట్ ఆప్షన్ లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్న క్లరికల్ మిస్టేక్స్ ఉన్నా ఓట్లు తొలగించడం రాజ్యాంగం ఇచ్చిన హక్కును లాక్కోవటమేనన్నారు. ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఈసీని కోరారు. సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించనున్న సభ ద్వారా ప్రజలకు జరిగే మంచి ఏమీ ఉండదన్నారు. ఆ సభలోనైనా నెరేళ్ల బాధితులకు న్యాయం చేసే అంశంపై ముఖ్యమంత్రి మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనలో ఇప్పటి వరకు ఎస్సీ కమిషన్ నివేదిక ఇవ్వలేదని, పోలీసులపై చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు. రాజకీయాలు మాని ప్రజలకు మంచి జరిగేందుకు సభలు నిర్వహించాలని ముఖ్యమంత్రికి సూచించారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళులు

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చిట్యాల (చాకలి) ఐలమ్మ జయంతి సందర్భంగా శనివారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. ఆమె చూపించిన స్ఫూర్తితో బహుజన తెలంగాణ సాధన కోసం ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్. రూప్ సింగ్, నవీన్ ఆచారి, మాధవి, శ్రీకాంత్ రావు, అర్చనా సేనాపతి, రాంకోటి, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్జిటీ ఉపాధ్యాయ సమస్యలపై జడ్పీహెచ్ఎస్

శివరాంపల్లి కాంప్లెక్స్ హెచ్ఎంకు వినతిపత్రం

ఇది కద నిజం, రాజేంద్రనగర్: ఎస్జిటీ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు తీవ్రమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జడ్పీహెచ్ఎస్ శివరాంపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీను నాయక్ కి ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జిటీ ఉపాధ్యాయులు క్లాస్‌రూమ్‌లలో పాఠాలు చెప్పడం కంటే బోధనేతర పనులకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోందని తక్షణమే ఈ అదనపు భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించడంతో పాటు, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం వల్ల ఉపాధ్యాయులపై తీవ్ర మానసిక ఒత్తిడి పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, జీవో 25ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక పీఎస్ హెచ్ఎం పోస్టును మంజూరు చేయాలని, ఎస్జిటి ఉపాధ్యాయులకు కూడా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా ఇటీవల ఎస్జిటీ ఉపాధ్యాయులపై జేపీసీ చైర్మన్ మారం జగదీశ్ చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 41,000 మంది ఎస్జిటీ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడటం ఎంతమాత్రం సబబు కాదని స్పష్టం చేశారు. మారం జగదీశ్ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాజేంద్రనగర్ మండల అధ్యక్షుడు బాలకృష్ణ మదగని, ఎస్టీయూ మండల అధ్యక్షుడు కామిశెట్టి వెంకటయ్య, కాంప్లెక్స్ సెక్రటరీ ఎం. షాలిని, ఆర్పి శ్రీనివాస్ రెడ్డి మరియు పలువురు ఎస్జిటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీనియర్ జర్నలిస్ట్ అమరేందర్ రావును పరామర్శించిన నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్



ఇది కద నిజం,హైదరాబాద్: రాఫ్తార్ టీవీ హిందీ న్యూస్ ఛానల్ సౌత్ ఇండియా ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ బి. అమరేందర్ రావును నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అమరేందర్ రావు ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న అమరేందర్ రావును డాక్టర్ రాహుల్ దేవరాజ్ స్వయంగా కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్స, ఆరోగ్య పరిస్థితి తదితర అంశాలపై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిమ్స్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలు, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు నిమ్స్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. అమరేందర్ రావుకు చికిత్స సమయంలో ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని డాక్టర్ రాహుల్ దేవరాజ్ ఆయనకు సూచించారు. అవసరమైన వైద్య సహకారం అందించేందుకు ఆసుపత్రి యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని డాక్టర్ భరోసా ఇచ్చారు. తన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు స్వయంగా వచ్చి పరామర్శించిన నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌కు సీనియర్ జర్నలిస్ట్ అమరేందర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిమ్స్ వైద్యులు, సిబ్బంది కూడ సహకరిస్తున్నందుకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

పిట్లం రెండో కేంద్రంలో ఘనంగా ఈసీసీఈ దినోత్సవం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: పిట్లం రెండో అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ (ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన విద్య, సంరక్షణ, పోషకాహారం, ఆటల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్ వినోద స్థానిక ఉపాధ్యాయులు పాల్గొని చిన్నారులతో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల శారీరక, మానసిక, సామాజిక వికాసానికి ప్రారంభ దశలోనే తగిన ప్రోత్సాహం అందించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక అంగన్వాడి ఉపాధ్యాయులు రాధా ప్రవీణ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌గా డాక్టర్ సంజీవరెడ్డి



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కామారెడ్డి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా చైర్మన్‌గా డాక్టర్ ముక్కర సంజీవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలో 15 మంది నిర్వహణ కమిటీ సభ్యుల స్థానాలకు 31 నామినేషన్లు దాఖలు కాగా, 16 మంది నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 15 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో సభ్యులంతా డాక్టర్ సంజీవరెడ్డిని చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2007లో రెడ్‌క్రాస్‌లో స్వచ్ఛంద సేవకుడిగా చేరిన సంజీవరెడ్డి ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైస్‌చైర్మన్‌గా, నిర్వహణ కమిటీ సభ్యుడిగా, యువజన రెడ్‌క్రాస్, జూనియర్ రెడ్‌క్రాస్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా సేవలందించారు. ఇప్పటివరకు సుమారు 67 సార్లు రక్తదానం చేయడంతో పాటు అనేక రక్తదాన శిబిరాలను నిర్వహించారు. గత ఏడాది కామారెడ్డి జిల్లాలో వరదలతో నష్టపోయిన బాధితులకు సహాయక చర్యలు చేపట్టారు. ఆయన సేవలను గుర్తించి చైర్మన్‌గా ఎన్నుకోవడంపై రెడ్‌క్రాస్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

చాకలి ఐలమ్మకు నల్లాల వినయ్ కుమార్ నివాళి



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా : చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నల్లాల వినయ్ కుమార్ ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరల పాలనను ధిక్కరించి వెట్టిచాకిరి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం అణగారిన వర్గాల హక్కులకై ఆమె నిర్భయంగా పోరాడారని కొనియాడారు. ఐలమ్మ పోరాటం ఒక వ్యక్తికి పరిమితమైనది కాదని, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా చరిత్రలో నిలిచిపోయిందన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 27-09-2026

జిల్లా ఆర్యవైశ్య సంఘంలో కుక్కునూరుకు తొలిసారి పెద్దపీట

- చక్రధర్‌రావు, లక్ష్మణస్వామి, చంద్రమోహన్‌లకు కీలక పదవులు



ఇది కద నిజం, కుక్కునూరు: ఏలూరు జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం జంగారెడ్డిగూడెంలో ఘనంగా, అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కుక్కునూరు మండలానికి ప్రత్యేక గుర్తింపు లభించింది. ఏలూరు జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం జిల్లా స్థాయి కార్యవర్గంలో కుక్కునూరు మండలం నుంచి తొలిసారిగా ముగ్గురు నాయకులు కీలక పదవులు దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కుక్కునూరు మండలం నుంచి నూతనంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన వారిలో నడిపల్లి చక్రధర్‌రావు జిల్లా ఉపాధ్యక్షులుగా, సమయమంతుల లక్ష్మణస్వామి వాసవి సేవాదళ్ ఉపాధ్యక్షులుగా, చిన్ని చంద్రమోహన్ వాసవి సేవాదళ్ అదనపు కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు సంఘ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కుక్కునూరు మండలం నుంచి ముగ్గురికి జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు దక్కడం పట్ల స్థానిక ఆర్యవైశ్యులు, సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయులకు శిక్షణ



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని ప్రౌఢమికోన్నత స్థాయి గణిత కాంప్లెక్స్ సమావేశాన్ని పిట్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి దేవి సింగ్ మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి స్థాయికి అనుగుణంగా బోధన అందించాలని సూచించారు. అనంతరం వనరుల వ్యక్తులు వివిధ అంశాలపై విడతల వారీగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పిట్లం, పెద్దకొడంగల్, నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుడుగ జంగం కాలనీలో డ్రైనేజీ పనుల పరిశీలన



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా : కామారెడ్డి జిల్లా పిట్లం గ్రామంలోని బుడుగ జంగం కాలనీలో జరుగుతున్న నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ పరిశీలించారు. కాలనీలో కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ నీరు నిలిచిపోతున్న సమస్యను గుర్తించి, నీరు సజావుగా ప్రవహించేలా అవసరమైన చోట్ల డ్రైనేజీ మార్గాలను సరిచేయించారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు రాంరెడ్డి, వార్డు సభ్యులు లింగం, జుక్కల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఇమ్రోజ్, బుడల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఛాయా సోమేశ్వరాలయంలో స్వచ్ఛతా కార్యక్రమం



నల్లగొండ (ఇది కద నిజం): నిత్యజీవితంలో ప్రజలు స్వచ్ఛతను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, చారిత్రక, పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని ఎఫ్‌సీఐ నల్గొండ డీఎం డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్ అన్నారు. భాగంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛతా హి సేవా--2026 కార్యక్రమంలో భాగంగా పానగల్లు సమీపంలోని చారిత్రక ఛాయా సోమేశ్వరాలయంలో ఎఫ్‌సీఐ అధికారులు, సిబ్బంది శనివారం స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, కొలను, పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. భక్తులు, సందర్శకులకు పరిశుభ్రత, బాధ్యతాయుత పర్యాటకం, వ్యర్థాల సక్రమ నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లను నిర్ణీత డస్ట్‌బిన్లలోనే వేయాలని సూచించారు... ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ నల్గొండ డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్ మాట్లాడుతూ.. స్వచ్ఛతపై అవగాహనను సమాజంలోని ప్రతి వర్గానికి తీసుకెళ్లడం సామాజిక బాధ్యతలో భాగం. చిన్నారులు, విద్యార్థులు, ప్రజలను స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా పరిశుభ్రమైన సమాజాన్ని నిర్మించవచ్చనీ అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారులు పవన్, ప్రకాశ, ఆదిమల్ల శంకర్, కాసిరెడ్డి, సాజిత్, రాము, ఉద్యోగులు జనార్దన్, మమత, గిరీష్మ, దివ్య, రాహుల్, జైన్, రాజు, నిర్వాహకులు క్రాంతి, శ్రీను, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

హైదర్‌గూడా, అత్తాపూర్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలి

- **పెద్ద తాళ్లకుంట వద్ద బోర్‌వెల్ వేయించి నిమజ్జనానికి శాశ్వత ఘాట్ నిర్మించాలి**
- **143 పిల్లర్ నుండి పాండురంగ నగర్ వరకు ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలి**
- **GHMC జోనల్ కమిషనర్‌కు ఎన్.మల్లారెడ్డి వినతిపత్రం**



ఇది కద నిజం, అత్తాపూర్: రాజేంద్రనగర్ జోన్ +నవీజ పరిధిలోని హైదర్‌గూడా, అత్తాపూర్ ప్రాంతాలలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బిజెపి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకయైన బతుకమ్మ పండుగ సమీపిస్తున్న తరుణంలో, హైదర్‌గూడా డివిజన్ పరిధిలోని పెద్ద తాళ్లకుంట డ్రైనేజీ నీటితో నిండి కంపు కొడుతోందని వారు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సరైన ఇమ్మర్షన్ ప్లాట్‌ఫాం లేకపోవడంతో మహిళలు మురికి నీటిలోనే బతుకమ్మలను నిమజ్జనం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కుంట వద్ద వెంటనే ఒక బోర్‌వేసి శుద్ధి చేసిన నీటిని నిమజ్జనానికి, పార్కుకు ఉపయోగించేలా చూడాలని, సురక్షితమైన శాశ్వత ఘాట్, లైటింగ్, బారికేడ్లు, తాగునీరు మరియు పరిశుభ్రత ఏర్పాట్లు చేయాలని కోరారు. అలాగే పిల్లర్ నంబర్ 143, గోల్డెన్ ప్యాలెస్ హోటల్ నుండి చిన్న అనంతగిరి శివాలయం మీదుగా పాండురంగ నగర్ వరకు ఉన్న రోడ్డు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై చెత్తాచెదారం వేయడం, పిచ్చి మొక్కలు పెరగడం వల్ల తీవ్ర దుర్వాసన వస్తోందని తెలిపారు. దీనివల్ల శివాలయానికి వచ్చే భక్తులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతూ అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తక్షణమే ఫుట్‌పాత్‌ను శుభ్రం చేయించి చెత్త వేయకుండా ఇంటర్‌లాకింగ్ టైల్స్ వేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డి. సత్యనారాయణ ముదిరాజ్, సాబాధ విజయ్ కుమార్, కుక్కునూరి కిరణ్ చారి, కాకులారం కృష్ణ కిట్టు, గొరిగే రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల పొట్టకొట్టి... సోషల్ మీడియా ప్రచారానికి

ప్రజాధనం తగలేస్తారా.. చంద్రబాబు గారు ?

- **తక్షణమే నిరుద్యోగ భృతి కి నిధులు విడుదల చేయాలి.**
- **డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్.**



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 26: లక్షలాది మంది నిరుద్యోగులకు ఎన్నికలలో యువతకు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి చెల్లించడానికి ఖజానాలో నిధులు లేవని చేతులెత్తేస్తున్న కూటమి ప్రభుత్వం, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను మేపడానికి, ప్రభుత్వ,పార్టీ ప్రచారానికి మాత్రం ప్రజాధనాన్ని నీళ్లలా ఎలా ఖర్చు చేస్తోందని, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల ఆకలి కేకలు పట్టవు కానీ, సోషల్ మీడియాలో డబ్బా కొట్టు కోవడానికి కోట్ల రూపాయలు వెచ్చిస్తారా చంద్రబాబు గారూ? అంటూ ఘాటుగా నిలదీశారు. శనివారం జమ్మలమడుగు లో స్థానిక ఎన్జీవో కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శివకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అనుసరిస్తున్న నిరుద్యోగ, యువజన వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.యువత ఓట్లతో గద్దెనెక్కి ఇప్పుడు ఇచ్చిన హామీలను విస్మరించడం దారుణం అన్నారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే ప్రతి నిరుద్యోగికి నెలకు రూ. 3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని, ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి లక్షలాది ఉద్యోగాలు భర్తీ చేస్తామని 'సూపర్ సిక్స్' పేరుతో ఊదరగొట్టిన చంద్రబాబు నాయుడు, అధికారంలోకి రాగానే ఆ హామీలను అటకెక్కించారని మండిపడ్డారు. యువత చదువులు పూర్తి చేసుకుని ఉపాధి లేక తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తుంటే, వారికి నెలకు రూ. 3,000 ఇవ్వడానికి బడ్జెట్ సాకులు చెబుతున్న ప్రభుత్వం తమ వ్యక్తిగత ఇమేజ్ పెంచుకోవడానికి, రీల్స్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు రూ. లక్షలు, కోట్లు గుమ్మరించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ప్రజల సొమ్ము పన్నుల రూపంలో సమకూరిన ప్రజాధనాన్ని నిరుద్యోగుల సంక్షేమానికి వాడాల్సింది పోయి, ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలకు, పీఆర్ ఏజెన్సీలకు కట్టబెట్టడం తీవ్రమైన విశ్వాస ఘాతుకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ, గ్రూప్స్, పోలీస్ రిక్రూట్ మెంట్ల కోసం ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ అప్పుల పాలవుతున్న యువత జీవితాలతో ఆటలాడటం ఇకనైనా మానుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి అర్హులైన ప్రతి నిరుద్యోగికి తక్షణమే రూ. 3,000 చొప్పున నిరుద్యోగ భృతిని విడుదల చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ భర్తీ చేసేలా సమగ్ర జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే ప్రకటించాలని, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ప్రజాధనాన్ని దోచిపెట్టే అనాలోచిత విధానాలకు తక్షణమే స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే నిరుద్యోగ యువతను ఏకం చేసి పోరుబాట పడతామని హెచ్చరించారు. ఉద్యోగాల కోసం రోడ్డెక్కిన యువత ఆగ్రహానికి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సుబహాన్ అరుణ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో పంటల వైవిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి..

వైపి. యంగ్ ప్రొఫెషన్ ప్రొద్దుటూరు డివిజన్ ఇంచార్జి భరత్ రెడ్డి...



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 26: కడప జిల్లా... జమ్మలమడుగు మండలం, ఎస్. ఉప్పలపాడు గ్రామంలో శనివారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, మండలాల ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలతో ప్రొద్దుటూరు డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజనల్ ఇంచార్జి భరత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు రైతులకు అందించాల్సిన సూచనలు, సలహాలు మరియు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.

ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న ప్రధాన పంటలతో పాటు అంతర పంటలు, బహుళ పంటలు, ఎర పంటలు, సరిహద్దు పంటలు సాగు చేయాలని సూచించారు. ఒకే పంటపై ఆధార పడకుండా ప్రధాన పంటతో పాటు అనుబంధ పంటలను సాగుతో పంటల వైవిధ్యాన్ని పెంచాలని తెలిపారు. ప్రతి రైతుకు ఘన, ద్రవ జీవామృతం, కషాయాలు తదితర ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. అలాగే బిఆర్సి బయో రిసోర్స్ సెంటర్ అందుబాటులో ఉన్న ద్రావణాలు, కషాయాలు, విత్తనాలు, జిగురు అట్టలు వంటి ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్స్ గురించి రైతులకు తెలియజేసి, వాటిని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. రైతుల భాగస్వామ్యంతో సామూహిక ఇన్‌పుట్స్ తయారీ చేపట్టాలని, అవసరమైన ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్స్ ను సామూహికంగా తయారు చేసుకునేలా రైతులను ప్రోత్సహింప చేయాలని సూచించారు. అలాగే రబీ పంటలు సాగు చేయని రైతులతో ఆర్డీఎస్, రబీ డ్రైవ్ సోయింగ్ విత్తనం వేయించి పశుగ్రాసంగా వినియోగించుకునే అంశంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులకు చేరువ చేయడంతో పాటు, రైతులు తమ పొలాల్లో పంటల వైవిధ్యాన్ని పాటించేలా క్షేత్రస్థాయిలో గ్రామ, గ్రామాన రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని, ప్రకృతి వ్యవసాయాన్ని రైతుల్లో మరింత విస్తృతంగా ప్రోత్సహించేందుకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐసి ఆర్పిలు, సీనియర్ ఐసిఆర్పిలు మరియు ఫార్మర్ మాస్టర్ ట్రైనర్స్ కర్నాటి లక్ష్మీదేవి, సివి. రమేష్, గురుమూర్తి, రమేష్, బాలనారాయణ, కె. దస్తగిరి, మాధవి, శ్యాం సుందర్ తది,తరులు పాల్గొన్నారు.

కడపలో కేంద్ర, రాష్ట్ర టిడిపి మంత్రుల నేతల సందడి..!!



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 26: కడప జిల్లా పర్యటన విచ్చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి జిల్లా ఇంచార్జ్ సవితమ్మ ను శనివారం కడప ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు మర్యాద పూర్వకంగా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి, జాతీయ ఉపాధ్యక్షులు హరి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి, గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ శివ చంద్రారెడ్డి లతో మంత్రి సవితమ్మను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఇంచార్జ్ మంత్రి సవితమ్మతో కలిసి భాకరాపేటలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ పోలీస్ పెరేడ్ మైదానంలో 521 మంది నూతనంగా శిక్ష పూర్తి చేసుకున్న పోలీస్ కానిస్టేబుల్ ల దీక్షాత్తు పరేడ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవితమ్మ జిల్లా ఎస్పీ నచికేత్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, తో కలిసి పరేడ్ మైదానంలో శిక్షకుల ఆధ్వర్యంలో గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత కడప జిల్లా పర్యటన విచ్చేసిన కేంద్ర పౌర విమానాశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ను విమానాశ్రయం నందు జిల్లా ఇన్చార్జి మంత్రి సవితమ్మ, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా టిడిపి అధ్యక్షుడు భూపేష్ రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి, సీనియర్ నాయకుడు పుత్తా నరసింహారెడ్డి, రాజంపేట ఇన్చార్జి చమర్తి జగన్మోహన్ రాజు, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ.జనార్దన్ రెడ్డి, పలువురు నాయకులుతో కలిసి కేంద్ర పౌర విమానాల శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. మొదటగా ఇవాళ కడపకు రావడం చాలా ఆనందంగా ఉంది అంటూ, ఆత్మీయ స్వాగతం పలికిన మీడియా ప్రతినిధులకు, నాయకులు, కార్యకర్తలకు, ధన్యవాదాలు తెలిపారు. కడప ప్రాంతాన్ని అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయడం లేదన్నారు. రాయలసీమ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని,

ఎయిర్ పోర్టు కనెక్టివిటీ, పరిశ్రమలు, రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని పని చేస్తూ.. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తామన్నారు.

కడప విమానాశ్రయ నూతన టెర్మినల్ ను పనులు త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

హైదరాబాద్, బెంగళూరు చెన్నై, ముంబై, ఢిల్లీ లాంటి ప్రాంతాలకు విమాన సర్వీసులు పెంచుతామన్న విషయాన్ని మీడియా ముఖంగా తెలియ జేస్తున్నానన్నారు.. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి రాష్ట్ర మంత్రులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు, టిడిపి సీనియర్ నాయకులు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ నాయుడు ఆహ్వానం మేరకు పొట్లదుర్తి గ్రామంలోని తన నివాసాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.